# ప్రగతి సిరి పోచంపల్లి

## అభివృద్ధిలో దూసుకెళ్తున్న మున్సిపాలిటీ

- రూ.50 కోట్లతో వివిధ రకాల పనులు
- ప్రధాన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌తో కొత్త కళ
- ప్రతి వీధికీ సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- హరితహారంలో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం
- పర్యాటకంగానూ ప్రత్యేక హంగులు

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 16 : సమైక్య పాలనలో ఏమాత్రం అభివృద్ధికి నోచని భూదాన్‌పోచంపల్లి స్వరాష్ట్రంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది. మున్సిపాలిటీగా ఏర్పాటైనప్పటి నుంచి ప్రగతి పరుగులు పెడుతున్నది. నాడు కనీస సదుపాయాలు కరువైన పట్టణంలో నేడు సకల వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. సుమారు రూ.50 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరిగాయి. పట్టణంలో ఎక్కడ చూసినా సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం, పచ్చదనంతో పరిశుభ్రత పరిఢవిల్లుతుంది. పర్యాటక కేంద్రమైన భూదాన్‌పోచంపల్లిలో గతుకులుగా ఉన్న రోడ్ల దుస్థితిని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో రూ.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరిగాయి. మున్సిపాలిటీలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నిధులతో పోలీస్ స్టేషన్ నుంచి గాంధీ విగ్రహం వరకు(1.60 కిలోమీటర్ల మేర) సుమారు రూ.7.30 కోట్లతో ప్రధాన రోడ్డును విస్తరించారు. మధ్యలో ఐదు 5 వెడల్పుతో డివైడర్, దానికి ఇరువైపులా 50 ఫీట్ల వెడల్పుతో రోడ్లను పునర్నిర్మించారు. రహదారి మధ్య 63 బటర్‌ఫ్లై లైట్లు అమర్చారు. డివైడర్ మధ్యలో వివిధ రకాల పూలమొక్కలు నాటారు. పట్టణ పరిధిలోని 13 వార్డుల్లో 19 కిలోమీటర్ల మేర అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.2.18 కోట్లతో 35 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. రూ.6.50 కోట్లతో వార్డుల్లో అవుట్ లైట్ డ్రైనేజీ నిర్మాణ పనులు, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5.15 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు, ఇందిరానగర్ కాలనీలో అంబేద్కర్ కళాభవన్‌కు రూ.20 లక్షలు మంజూరు చేశారు. రోడ్ల విస్తరణలో భాగంగా పనులు చేపట్టి మొక్కలు నాటడంతో అవి పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.



నాలుగు లేన్ల విస్తరణ అనంతరం భూదాన్‌పోచంపల్లిలోని ప్రధాన రహదారి



పోచంపల్లి పట్టణంలో వేసిన సీసీ రోడ్డు

### పట్టణ ప్రగతితో మారిన రూపురేఖలు

పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతి పేరున ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు పోచంపల్లి పట్టణానికి రూ.5.74 కోట్లు మంజూరు చేసింది. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. పట్టణంలోని మూడు నర్సరీలు, 13 పట్టణ ప్రకృతి వనాలు, ఒక ఫ్రీడం పార్క్, 12 కిలోమీటర్ల మేర అవెన్యూ, మీడియన్, ఎంఎల్‌ఏపీ ప్లాంటేషన్ చేపట్టి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పారిశుధ్య నిర్వహణకు 7 వాహనాలను కొనుగోలు చేశారు. పట్టణంలో 2014కు ముందు రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉండగా, ఇప్పుడు రూ.25 లక్షలతో ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. మల వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.90 లక్షలతో 15కేఎల్‌డీ సామర్థ్యంతో ఎఫ్ఎస్‌టీపీ మంజూరు చేసింది. పట్టణంలోని వీధివీధినా సీసీ రోడ్లు వేశారు. సీసీ రోడ్లతో వీధులన్నీ పరిశుభ్రంగా మారడంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### పోచంపల్లి సమగ్రాభివృద్ధే ధ్యేయం



పర్యాటక కేంద్రమైన భూదాన్‌పోచంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తా. పట్టణంలో గతుకులు, గుంతలు లేకుండా చూస్తాం. పట్టణ పరిధిలోని 13 వార్డుల్లో అంచలంచెలుగా మౌలిక వసతులు కల్పిస్తాం. పర్యాటక కేంద్రాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దుతా. రాజకీయాలకతీతంగా భువనగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా.

–పైళ్ల శేఖర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

### ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి



ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. పోచంపల్లి ప్రధాన రహదారిని విస్తరించాం. బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేయడంతో పట్టణం విద్యుత్‌కాంతులతో జిగేల్‌మంటుంది. గల్లీగల్లీలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాం. ఇంకా మిగిలి ఉన్న పనులను దశలవారీగా చేపడుతాం.

–చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్



# పారదర్శక పాలన

పైరవీలకు తావులేదు.. అధికారులకు లంచాలు లేవు
దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలించి పథకాల అమలు
కేసీఆర్ పాలనకు జై కొడుతున్న మహిళా లోకం

గతంలో ప్రభుత్వ పథకాల కోసం కార్యాలయాలు, లీడర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. అయినా వచ్చే పింఛన్ కేవలం రూ.200 మాత్రమే. ఒంటరి మహిళలు, బీడీ కార్మికులను పట్టించుకోనే లేదు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని కేవలం పార్టీ కార్యకర్తలకే ఇచ్చేవారు. రూ.40 వేలు మంజూరైతే అందులో రూ.20 వేలు నాయకులు, అధికారులే దండుకునేవారు. ఎంతో మంది వృద్ధ మహిళలు కార్యాలయాల చుట్టూ తిరిగి తనువు చాలించిన దాఖలాలు ఉన్నాయి. లంచం ఇవ్వనిదే పథకాలు అందే పరిస్థితి ఉండేది కాదు. కానీ, నేడు సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరగాల్సిన పని లేదు. దరఖాస్తు చేసుకుంటే చాలు.. నేరుగా అర్హుల ఇండ్లకు అధికారులు వచ్చి పథకాలు మంజూరు చేస్తున్నారు. గతంలో మాదిరిగా కార్యాలయాల చుట్టూ తిరగడం లేదని, నెల నెలా గ్రామాలకు వచ్చి పింఛన్లు అందజేస్తున్నారని అభిప్రాయపడుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– యాదగిరిగుట్ట, అక్టోబర్16

### గతంలో 20 సార్లు తిరిగితే రూ.300 ఇచ్చిండ్రు



కాంగ్రెస్ హయాంలో పింఛన్ ఇవ్వాలని ఆఫీసర్ల చుట్టూ తిరిగినా ఎవ్వరూ పట్టించుకోలే. సార్ లేడు.. రేపు రా.. మాపు రా.. ఆ కాగితం లేదు.. ఈ కాగితం కావాలె.. అంటూ సాకులు చెబుతూ 20 సార్లు తిప్పించుకుండ్రు. ఆఖరికి రూ.300 ఇచ్చిండ్రు. సార్‌కు రూ.వెయ్యి ఇయ్యాలె అని తీసుకున్నరు. కేసీఆర్ సార్ వచ్చినంక ఒక్కసారి ఆఫీసుకు వెళ్లి కాగితాలు ఇచ్చిన. ఆ తర్వాత నెలనెలా పింఛన్ ఇస్తుండ్రు. నెలకు రూ.2016 వస్తున్నాయి. వచ్చిన పైసలు మందులు, చేతి ఖర్చులకు సరిపోతున్నయి. కేసీఆర్ సారే మళ్లీ ముఖ్యమంత్రి కావాలె.

–పంజాల సరోజన, ఆసరా పింఛన్ లబ్ధిదారురాలు, బాహుపేట, యాదగిరిగుట్ట మండలం

### గృహలక్ష్మి మంజూరైంది



వ్యవసాయం చేసుకుని జీవించే బతుకులు మావి. ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం. సగం కూలిపోయిన ఇంట్లోనే జీవిస్తున్నాం. 20 ఏండ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇల్లు కట్టుకోవాలని అడిగితే ఎవ్వరూ పట్టించుకోలేదు. ఎన్నో సార్లు నాయకుల చుట్టూ తిరిగాం. ఏనాడూ మాపై కనికరం చూపలే. ఏదో ఒకరోజు మాకు న్యాయం జరుగకపోతదా? అని చూస్తున్నాం. చివరికి ఇప్పుడు గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరైంది. ఎమ్మెల్యే చేతుల మీదుగా మంజూరు పత్రం అందుకున్నా.

–బత్తిని విజయ, గృహలక్ష్మి లబ్ధిదారురాలు, దత్తాయిపల్లి, తుర్కపల్లి

### పైరవీ లేకుండా డబుల్ బెడ్రూం ఇల్లు



మాది మధ్య తరగతి కుటుంబం. నా భర్త ఆటో కార్మికుడు. ఇల్లు లేక గత 15 ఏండ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. గత ప్రభుత్వాలు సాయం చేస్తాయని అనుకున్నాం. కానీ చేయలేదు. తెలంగాణ రాష్ట్రంలోనైనా సాయం అందుతుందని భావించాం. అర్హులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందజేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. మాకు దానిపై నమ్మకం కలిగింది. ఎమ్మెల్యే చొరవతో మా గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టారు. మేం దరఖాస్తు చేసుకున్నాం. గ్రామసభలో మమ్మల్ని అర్హులుగా గుర్తించారు. ఎవ్వరికీ పైసా ఇవ్వకుండా, పైరవీకి తావులేకుండా మాకు డబుల్ బెడ్రూం వచ్చింది.

–దూడల స్రవంతి, డబుల్ బెడ్రూం లబ్ధిదారురాలు, కొలనుపాక, ఆలేరు